# అభయం

## శ్రీ కలువకొలను సదానంద

రామచిలక రామచిలక
        ఏడకెడితివి?
    అడవిదాటి ఊరిలోకి
    ఎగిరి పోతివి
ఊరిలోని వారు నిన్ను
పట్టుకుండిరా ?
    పట్టుకేమి ? రాజుగారె
    పట్టుకెళ్లిరి
రాజుగారు పట్టుకెళ్లి
ఏమిచేసిరి ?
    బంగరు పంజరములోన
    పడుకొమ్మనిరి !
ఆకలైతే నీకు తిండి
ఏమి పెట్టిరి ?
    పంచభక్ష్య పరమాన్నము
    లన్ని పెట్టిరి !
నిన్ను ముద్దు చేయు వారు
ఎందరుందురు ?
    ఆటగాండ్రు, పాటగాండ్రు —
    లెక్కకందరు !
నీవులేక పోతే, రాజు
ఉండగలుగునా?
    ఉండలేడు గనుక నన్ను
    తరుముకొచ్చెను !
ఉండిపోక, ఎందుకిట్లు
పారిపోతివి ?
    భోగమేల ? భాగ్యమేల ?
    స్వేచ్ఛ చాలును !

—పిల్లల కోసం వ్రాసిన పాట యిది!
అవును, పిల్లలకోసమే! మొక్కై వంగనిది మ్రానై వంగునా?

వంచటానికి సాధ్యపడనంతగా చేవబారి పోయింది ఇప్పటి సమాజం. భావి సమాజానికైనా యిట్టి దుర్గతి వాటిల్లకుండా వుండాలంటే —ఏదేశానికైనా, ఏ జాతికైనా పిల్లలే దిక్కు ! పోతన్న తన భాగవతాన్ని మట్టిలో దాచి పెట్టినట్లు —మానవతకు జీవంపోసే కొన్ని విలువల్ని మనం పిల్లల్లో దాచి, పెంచాలి. ఈ బాధ్యత తల్లిదండ్రులదా? ఉపాధ్యాయులదా? సమాజానిదా?సర్కారువారిదా?. . . .అందరిదీనూ!. . . .పోలీసువాళ్ళ లాలూచీతో రాత్రి తెల్లవార్లూ జరిగే తిరణాలలా తయారైన నేటి సమాజ వాతావరణంలో పిల్లల మీద ఉపాధ్యాయుడి ప్రభావం ఎంత వుంటుంది ?సేతువు మీద ఉడత దులిపిన ఇసుక రేణువంత !. . . .అంతే చాలు !

. . ఈ పాట పిల్లలకు నేర్పాను. అయితే వాళ్ళలో ఒక కుర్రాడే ఆ పాటలో స్పందించే హృదయం మీద ఒక ప్రయోగం లాంటిది చేసి, మరో సూక్ష్మ సిద్ధాంతాన్ని నా ముందు పెడతాడని నేను కలలో కూడా అనుకోలేదు.

వాడిపేరు గాంధీ! గాంధీ నా వద్ద లెంపకాయలు తిని చదువు కుంటున్నాడు. నేనేదో తమాషాకంటున్న మాట కాదిది! దేశంలోని పేర్ల జాబితా సంపాదించండి. అందులో ఒక్కగాంధీలే కాదు, నెహ్రూలు, బోసులు కూడాఎందరో మీకు కనిపిస్తారు.

ఆ రోజు పిల్లలంతా ఆ పాటను అప్పజెప్పవలసి వుంది. అందరికంటే ముందు గాంధీ లేచి చేతులుగట్టుకుని నుంచున్నాడు. నీళ్ళు నములుతూ "మేష్టారు గారూ. . . ." అన్నాడు.

"చెప్పు మరి!" అన్నాను.
వాడు పాట చెప్ప లేదు.
"చెప్ప లేవా ?"

"చెప్పగలను కానీండి, మీరు స్వేచ్ఛ చాలన్నారు కదా — మరైతేనండీ — మరేనండీ. . .' అంటూ మాటలు వెతుక్కో సాగాడు.

'ఏమిట్రా ఆ తికమక ? నువ్వు చెప్పాలనుకున్నదేదో నింపాదిగానే చెప్పు !'

వాడొక చిత్రమైన కథ చెప్పాడు. దాన్ని నా మాటల్లో మీకు చెబుతాను.

కోడి గ్రుడ్లు పెట్టును. గ్రుడ్లు తిన్నచో బలము కలుగును. కొందరు కోడిమాంసమును తిందురు. గాంధీవాళ్ళమ్మ మూడు రూపాయలిచ్చి, మూడు నెలల కోడిపిల్లనొకదాన్ని కొనుక్కుంది. అది మచ్చికయ్యేంతవరకు దాని మీది హక్కు శాశ్వతంకాదు. కాబట్టి తాడువేసి దోడ్లోవున్న నులకమంచం కాలికి కట్టిపెట్టింది. ముందర చల్లిన గింజల్ని బొక్కుతూ, ఆ కోడి పగలల్లా అలా వుండేది. రాత్రుల్లో వెచ్చగా గంపక్రింద ముడుక్కునేది. ఇలా రెండు రోజులు గడిచాయి.

ఈ రెండు రోజులూ గాంధీని ఆవహించిన మానసికస్థితి అనిర్వచనీయమైనది. సహజంగానే వాడు జాలి గుండెకలవాడు. దానికి తోడు, పంతులు నేర్పిన పాట వాణ్ణి ప్రభావితుణ్ణి చేసింది.

వాడు కోడిపిల్ల వైపు జాలిగా చూస్తూ మవునంగా ఏమిటేమిటో ఆలోచించు కునేవాడు. బంగారు పంజరాన్ని, పట్టుపరుపుల్ని, పంచభక్ష్యపరమా

న్నాల్నీ, ముద్దుమురిపాలతో ఆలరించే దానదాసీ జనాన్ని, సకల భోగభాగ్యాల్ని వదలిపెట్టి— రామచిలుక ఎందుకు పారిపోయింది? దేనికోసం? పాపం, ఈ కోడిపిల్లకు 'అది' కావాలని వుండదూ? ఇలా కాలికి తాడేసికట్టి పడెయ్యడం అన్యాయం కదూ ?

వాడు దానికి గింజలు వేసేవాడు. తింటున్న అన్నంలోంచి కొన్నిమెతుకులు దానిముందరవేసి, అది గబాగబాతింటుంటే, తాను తినడం మరిచిపోయి చూస్తూ నిలబడేవాడు. మంచం మీద కూర్చుని, దాన్ని తన ఒడిలో కూర్చోబెట్టుకుని, రాయంచకు అభయ మిచ్చిన బాలగౌతముడిలా రెక్కలు నిమిరేవాడు.

మొదటిరోజు, కోడిపిల్ల మనుష్యుల్నిచూచి బెదరి, కీచుకీచు మంటూ గల్లంతు చేసేది. కట్టు(తాడుతో అడ్డదిడ్డంగా ఎగిరి,బోర్ల పడేది. దాని కంగారు తగ్గటానికి ఒక రోజు పట్టింది.

గాంధీ దాన్ని తన ఒడిలో పెట్టుకున్నప్పుడు అది వాడికళ్ళలోకి నిశ్చలంగా చూసేది. ఆ గాజు కళ్ళలోని చూపులకు అర్థమేమిటో ఎవరికి తెలుసు? అయితే, గాంధీ ఆ చూపులకు కదలిపోయేవాడు. 'నువ్వు, మీ అమ్మ, మీనాన్న కలిసి నా గొంతు కోసేస్తారు కదూ?'అని అది దిగులుగా అడుగు తున్నట్టు, 'బాబ్బాబూ ! నీకు పుణ్యం వుంటుంది. నన్ను విడిచిపెట్టేయరాదూ ? ఏ అడవికైనా పారిపోయి స్వేచ్ఛగా తలదాచుకుంటాను'అని జాలిగా వేడుకుంటున్నట్టు అనిపించేది వాడికి.

ఆఖరికి ఒక నిర్ణయానికి వచ్చాడు గాంధీ. రోజూ పెందరాలే నిద్రపోయేవాడు, గతరాత్రి అందరూ నిద్రపోయేదాకా మేలుకున్నాడు. చప్పుడుగాకుండా దొడ్లోకి వెళ్ళాడు. గంపతిరగేశాడు. కోడికాలికున్న దారాన్ని విప్పేశాడు. కోడిని రెండు చేతులతో పైకెత్తి, దొడ్డిగోడకు అవతల విసిరేశాడు. పిల్లిలా నడిచివెళ్ళి గప్‌చిప్‌మంటూముసుగు తన్నాడు. హాయిగా నిద్రపోయాడు.

ఉదయం మెలుకువ వచ్చింది. మెలుకువతోబాటు కోడిపిల్ల జ్ఞప్తికి వచ్చింది. పడక మీదినుంచి లేవడానికి భయం వేసింది గాంధీకి. గబుక్కున ముఖం మీద మళ్ళీ ముసుగేసుకున్నాడు.

అమ్మకేకలు చెవిని బడతాయని ఎదురుచూస్తున్న గాంధీకి —దొడ్లో కోడిపిల్ల అరపులు వినిపించాయి. వాడికి ఆశ్చర్యం వేసింది. గబుక్కున ముసుగు తీసి, చెవులు రిక్కించాడు. ఆ అరపులు దానివేనా?. . . .గాంధీ దొడ్లోకి పరుగు తీశాడు.

తులసికోట ప్రక్కనే —కోడిపిల్ల గింజలు ఏరి తింటోంది.

నూతివద్ద నీళ్ళు తోడుతున్న తల్లిని అడిగాడు వాడు : 'అమ్మా ! ఆ కోడిపిల్ల మనదేనా ?'

'అవునురా !ముమ్మూర్తులా మనదే ! అది ఎంత గారడీ చేసిందో తెలుసా ? తెల్లారేసరికి కట్టుతాడు విప్పుకొంది, గంపతిరగేసేసింది. గంప పైకెత్తి, దాన్ని బయటికి తీద్దామని దగ్గరికి వెళితే, గంప తిరగబడి వుంది. గంపపక్కనేకోడి పిల్ల ముడుచుకుని వుంది' అంటూ నవ్విందామె.

గాంధీ ఈ కథ చెప్పి, ఏదో తమాషా చెప్పి ముగించినంత ఉత్సాహంగా నవ్వాడు.

'నువ్వు కోడిపిల్లను తరిమేసిన సంగతి మీ అమ్మకు చెప్పావా?' అని అడిగాను.

చెప్పానండీ ! 'ఆరి బడుద్దాయ్ !' అంటూ నవ్వింది "తింటానికితిండీ, ముడుక్కోటానికి గూడూ, హాయిగా తిరగటానికి మైదానమంతదొడ్డీ. . .ఇవన్నీ ఒదలిపెట్టి వెళ్ళిపోయేంత తెలివితక్కువది కాదులేరా ఈ కోడిపిల్ల. . .' అంది మేష్టారూ !'

. . . .నా ఆలోచనలకు అంతరాయంగా "పాట ఒప్పజెప్పమంటారా మేష్టరుగారూ ?' అన్నాడు గాంధీ.

'తరువాత చెబుదూగానీలే, కూర్చో !' అన్నాను.

ఒక నిమిషంపాటు ఆలోచనల వెంట పరుగెత్తి నన్నునేను మరచిపోయాను. పిల్లలు —చీమచిటుక్కుమంటే వినిపించేంత నిశ్శబ్దంగా వున్నారో, లేక చెవులు చిల్లులు పడేట్లుగా గోలచేస్తున్నారో నాకు తెలియ లేదు.

పంజరంలో చిలకకు బందీ అని పేరు పెట్టింది మనమేకదా ? తాను బందీఅని చిలక బాధపడుతుందా? అక్బరు చేతిమీద కూర్చున్న పెంపుడు చిలక ఆకాశపుటంచులకు ఎగిరిపోతుందా?నేను చెప్పిన రామచిలుక సర్వస్వమూ వదులుకుని, నిజంగా పారిపోయిందా?. . . .అవన్నీ కథలు ! కథ గుండ్రాయిలాంటిది ! ఎటు తిప్పితే అటు దొర్లుతుంది.

గాంధీ చెప్పింది కథకాదు, వాస్తవం !

ఆ కోడిపిల్ల పీక కత్తి అంచున వుందన్న మాట నిజం. అయితే ఆ విషయం దానికి తెలుసునా, తెలియదా అన్నదికాదు ప్రశ్న. ఎన్నిజన్మలైనా, ఎన్ని ప్రాణాలైనా సంతోషంగా ధారపోసి సంపాదించదగిన స్వేచ్ఛను —ఆ కోడిపిల్ల ఎందుకు కాలదన్నేసింది? దాని స్వేచ్ఛకోసం తహతహలాడిపోయిన గాంధీని యింత గమ్మత్తుగా ఎందుకు వెక్కిరించింది ? అలవాటైన పరిస్థితులతోనే తన బ్రతుకును ఎందుకు సర్దుకునేసింది ? స్వేచ్ఛకంటే ఎక్కువగా దాని విశ్వాసాన్ని చూరగొనగలిగినదీ, స్వేచ్ఛ యివ్వలేని సంతృప్తిని దానికి యిచ్చినటువంటిదీ ఏది ? దాని పేరేమి ?